క్లుప్తంగా

పైపులైన్లు తవ్వే ముందు జాగ్రత్తలు పాటించాలి

ఓజిలి: మండలంలోని అత్తివరం, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో రోడ్డు పక్కనే పైపు లైను వేశామని, ఎవరైనా తవ్వకాలు జరిపే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏజీ అండ్ పీ గ్యాస్ పరిశ్రమ యజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామస్తులు కొంత మంది రోడ్డు పక్కన తవ్వకాలు జరిపి గ్యాస్ పైపులైన్లను ధ్వంసం చేస్తున్నారని పేర్కొంది. పైపులైన్లు ధ్వంసం చేసే సమయంలో గ్యాస్ లీకై ప్రమాదాలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. పైపులైనుల ధ్వంసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. తవ్వకాలు చేసే ముందు తమకు సమాచారం ఇవ్వాలని కోరింది. అత్యవసర సమయాల్లో 18002022999 నంబర్‌ను సంప్రదించాలని సూచించింది.

అధ్యాపకురాలికి డాక్టరేట్


వల్లీదేవి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్‌అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకురాలు టి.వల్లీదేవికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన జేఎస్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆమె అధునాతన మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా కనెక్ట్ చేయబడిన అటానమస్ వెహికల్స్‌లో సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడం అనే అంశంపై ప్రొఫెసర్ విజయభాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఆమెను కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోట: ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్టేడు పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆయన శనివారం తమ సిబ్బందితో కలిసి కోట నార్త్ గిరిజన కాలనీలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు.

వెదురుపట్టులో 104 వైద్య సేవలు

దొరవారిసత్రం : స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని వెదురుపట్టులో శనివారం 104 వాహనం ద్వారా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేశారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు తదితరాలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 35.556 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో శనివారం నాటికి 35.556 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయంలోకి వరద కాలువ నుంచి 300, సోమశిల జలాశయం నుంచి 9900 క్యూసెక్కుల నీరు చేరుతోందని పేర్కొన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 140, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

డీఎస్సీకి ఉచిత శిక్షణ

వెంకటగిరి రూరల్ : డీఎస్సీ రాయడానికి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇస్తోందని ఏఎస్‌డబ్ల్యూవో ఎం.లక్ష్మీరాజ్యం తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు తెలిపారు. ఆసక్తి కల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వెంకటగిరి(సైదాపురం) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష తెలిపారు. పట్టణంలోని క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం పలు ప్రత్యేక చట్టాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలోని వసతి గృహాలు, భోజనశాల, వంటగదులను పరిశీలించారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణలో శుభ్రతా పనులు చేపట్టారు. ఏఎస్‌ఐ బీవీ రమణ, ప్రిన్సిపాల్ రజని తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి గృహోపకరణాలు ధ్వంసం

బాలాయపల్లి(సైదాపురం) : మండలంలోని గొట్టికాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున సుబ్రమణ్యం ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఏసీ, ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషిన్, విద్యుత్ మీటర్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయి. ఇంటి గోడ కూడా కొంత దెబ్బతినింది. సుమారు రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరాడు.

బడులు.. సమస్యల లోగిళ్లు

పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు సరైన వసతులు కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారు. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చింది. వసతులు కల్పించింది. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహించడంతో పాఠశాలల ఆలనా పాలనా కరువైంది. వసతులు మృగ్యమై పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ట్యాబ్‌లు మూలన పడ్డాయి. పౌష్టికాహారం అందడం లేదు. బదిలీలు చేపట్టినా ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. పాఠశాలల్లోని వసతులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై సాక్షి బృందం శనివారం పరిశీలన చేసింది. దీనిపై ప్రత్యేక కథనం.

- అధ్వానంగా మరుగుదొడ్ల నిర్వహణ
- బదిలీలు చేపట్టినా తప్పని ఉపాధ్యాయుల కొరత
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


చిల్లకూరు జెడ్పీ హైస్కూల్‌లో మహిళా టీచర్లు వినియోగించే పాత మరుగుదొడ్ల దుస్థితి

చిల్లకూరు/సైదాపురం/వెంకటగిరిరూరల్/ సూళ్లూరుపేట : గూడూరు నియోజకవర్గంలో 360, వెంకటగిరి నియోజకవర్గంలో 480, సూళ్లూరుపేట నియోజకవర్గంలో 392 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 90,620 మంది పిల్లలు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాలలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇచ్చిన ట్యాబ్‌లు మూలకు చేరాయి. మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. చాలామంది పిల్లలు ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. వారంలో ఐదు రోజులు ఇచ్చే కోడిగుడ్లలో ఎక్కువ శాతం కుళ్లినవి ఉంటుండడంతో పిల్లలు పడేస్తున్నారు. వారంలో మూడు రోజులు రాగి జావ, మూడు రోజులు చిక్కీలు అందిస్తున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రత గురించి పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. కొన్నింటిలో కొళాయిలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల మరుగుదొడ్లకు తాళాలు వేశారు.

రెండు నెలలుగా అందని జీతాలు లేవు

పాఠశాలలో విద్యార్థులకు వంట చేసి వడ్డించే వారికి ఆగస్టు నెలలో జీతాలు ఇచ్చారు. తర్వాత పట్టించుకోలేదు. అలాగే విద్యార్థుల సంఖ్యను బట్టి వంట నిర్వాహకులు అసిస్టెంట్లను తీసుకుంటే ఒక్కరికి రూ.3 వేల చొప్పున జీతం ఇవ్వాల్సి ఉంది. గత నెలలో ఒకరికి వెయ్యి చొప్పున చెల్లించారు. దీంతో వారు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల వంట నిర్వాహకులను తొలగించి టీడీపీకి అనుకూలంగా ఉన్న వారిని ఏర్పాటుచేశారు. వారు మెనూ ప్రకారం కాకుండా తమకు ఇష్టం వచ్చినట్టు భోజనం పెడుతున్నట్టు పిల్లలు ఆరోపిస్తున్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు...

మండలం	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత
వెంకటగిరి	86	02	13
బాలాయపల్లి	59	05	05
డక్కిలి	60	05	06
సైదాపురం	76	05	09
రాపూరు	62	07	07
కలువాయి	54	07	05
గూడూరులో..			
గూడూరు	67	8	14
చిల్లకూరు	61	09	09
కోట	59	05	08
వాకాడు	61	05	05
చిట్టమూరు	53	01	09

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు

గూడూరులో ఏడుగురు, చిల్లకూరులో నలుగురు, కోటలో ఐదుగురు, వాకాడులో నలుగురు, చిట్టమూరులో 8 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. సైదాపురం మండలంలోని చీకవోలు యూపీఎస్, లింగన్నపాళెం, తోకలపూడి ఎడబ్ల్యూ, తిమ్మసముద్రం, మొలకలపూడి, ఊటుకూరు మెయిన్, తురిమెర్ల మెయిన్‌లలో విద్యార్థుల సంఖ్య పెరిగినా ఒక్క ఉపాధ్యాయుడిని మాత్రమే నియమించారు.


చిల్లకూరు జెడ్పీ హైస్కూల్‌లో మరుగుదొడ్లకు తాళం, కొళాయిలు లేని యూరినల్స్

ఆర్కాసిట్రస్‌తో నిమ్మ పంట శ్రేయస్కరం

వెంకటగిరి రూరల్ : నిమ్మపంటలో నాణ్యమైన దిగుబడి సాధించేందుకు ఆర్కాసిట్రస్ ఎంతగానో దోహదపడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో సాగులో ఉన్న నిమ్మ పంటలో సూక్ష్మధాతు పోషకాలు, ఐరన్, జింక్, బోరాన్ వంటి లోపాలు ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం వారు రూపొందించిన ఆర్కా సిట్రస్ స్పెషల్ 5 గ్రాములను లీటరు నీటిలో పిచికారీ చేస్తే లోపాలు తగ్గి అధిక దిగుబడులు వస్తాయన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరూరు విద్యార్థులు



చిట్టమూరు (చిల్లకూరు) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని ఏసీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో చిట్టమూరు మండలం ఆరూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్రవంతి, శరణ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని శనివారం హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు. ఆమె పీఈటీ సురేష్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వారు సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ -17 వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

వెంకటగిరి రూరల్ : సచివాలయ ఉద్యోగి నెలపాటి వెంకటసాయిపై దాడి చేయడంతోపాటు దుర్భాషలాడిన 5వ వార్డు కౌన్సిలర్ నారిశేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ నియోజకవర్గ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి కోరారు. ఆయన శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న వార్డు మౌలిక సదుపాయాల కార్యదర్శి వెంకటసాయి వికలాంగుడని తెలిపారు. అతనిపై కౌన్సిలర్ శేఖర్ దాడి చేయడం దారుణమన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి


డక్కిలి: అభ్యసనా వైకల్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నాగరాజు

డక్కిలి : ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అర్థమయ్యేలా బోధన చేపట్టాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలిపారు. డక్కిలిలో ఉన్న భవిత కేంద్రంలో శనివారం విద్యార్థులకు అభ్యసన వైకల్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న ప్రత్యేక అవసరాల గల పిల్లలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అభ్యసన వైకల్యాలు నాలుగు రకాలని, అందులో భాషా వైకల్యం, పఠన వైకల్యం, లేఖన వైకల్యం, గణిత పరమైన వైకల్యం గురించి పూర్తి స్థాయిలో వివరించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు బీకే సౌమ్య, బాలమేరి పాల్గొన్నారు.

నిమ్మలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం: నిమ్మలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని నెల్లూరు జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన శనివారం పొలూరు రైతు భరోసా కేంద్రంలో నిమ్మ రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బిందు, తుంపర్ల పరికరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వో ఆనంద్, ఏవో హైమావతి, శాస్త్రవేత్త నాయక్ పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం


అధికారులను ప్రశ్నిస్తున్న మర్లపూడి ఎంపీటీసీ

సైదాపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు శ్రీనివాసులు, వెంకటరమణయ్య మాట్లాడుతూ తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయాలని రెండేళ్లుగా విన్నవిస్తున్నా ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని వాపోయారు. స్పందించిన ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి ఎంపీటీసీకి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నామని, వాటితో పనులు చేయించుకోవాలని సూచించారు. మండలానికి వివిధ పథకాల కింద రూ.1.66 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, అనంతమడుగు వెంకటరమణయ్య, పాలూరు ఈశ్వరరాజు, తురిమెర్ల కరణం రమణమ్మ, ఎంపీటీసీలు సుమతి, శిరసనంబేటి పద్మమ్మ, నాగరాజు, ఏవో హైమావతి, ఏపీఎం చంద్రశేఖర్, ఏఈలు వెంకటేశ్వర్లు, దయాశ్, మనోజ్, సీడీపీవో సునంద, ఎంఈవో దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులు


పెరికింలిపాటి కండ్రిగలో భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో, నాయకులు

నాయుడుపేట టౌన్ : పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో రూ.1.40 కోట్లతో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నట్టు ఎంపీడీవో సురేష్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పెరికింలిపాటి కండ్రిగలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అరవపెరిమిడికి రూ.15 లక్షలు, భీమవరానికి రూ.20 లక్షలు, చిగురుపాడుకు రూ.10 లక్షలు, చిలమాత్తూరుకు రూ.8 లక్షలు, గొట్టిప్రోలుకు రూ.10 లక్షలు, జువ్వలపాళెం పంచాయతీ కారు మంచివారికండ్రిగకు రూ.5 లక్షలు, కాపులూరు పంచాయతీకి రూ.10 లక్షలు, మర్లపల్లికి రూ.5 లక్షలు, మేనకూరుకు రూ.21 లక్షలు, పుదూరుకు రూ.10 లక్షలు, తిమ్మాజికండ్రిగకు రూ.10 లక్షలు, విన్నమాలకు రూ.15 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఉపాధి ఏపీవో షీలు, వెలుగు ఏపీఎం ఉమాదేవి, నాయకులు సన్నారెడ్డి చంద్రారెడ్డి, పల్లమాల రామిరెడ్డి, అన్నమేటి ప్రసాద్, బల్లి ముత్యాలయ్య, అన్నమేటి చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులు గోపాల్, గోవిందయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు గ్రామంలో శనివారం జరిగిన గ్రామసభలో పలువురు గ్రామస్తులు భూసమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. పట్టాదారు పేరు, సర్వే నంబరు, భూవిస్తీర్ణం తదితర వివరాల నమోదులో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేయాలని కోరారు. తహసీల్దార్ ద్వారాకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామసభలో వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ కందమూడి శివకుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ హరిహర, ఆర్‌ఐ సంతోషి జీబాయి, మండల సర్వేయర్ పూజిత, వీఆర్వో వంశీ, సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


డీసీ శ్రీనివాసులురెడ్డికి నగదు అందజేస్తున్న దాతలు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. 6 గంటలకు పూలంగి సేవ చేశారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. తదుపరి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం

మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం నెల్లూరుకు చెందిన చింతగింజల చిన్న పెంచలయ్య జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని రాజేశ్వరి, కుమారులు ప్రదీప్, సుధీర్ రూ.50 వేలు విరాళం ఇచ్చారు. వారికి ఆలయ డీసీ శ్రీనివాసులు రెడ్డి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



వాకాడు : మండలంలో వల్లమేడు గ్రామం వద్ద శనివారం ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం మేరకు.. ఇటీవల కురిసిన వర్షానికి వాకాడు – చినతోట మధ్య రోడ్డులో గుంతలు పడింది. ఈ క్రమంలో వల్లమేడు గ్రామం వద్ద రోడ్డుపై పడిన గుంతలో ఆర్టీసీ బస్సు ఒక్క సారిగా దిగడంతో కట్టలు విరిగిపోయాయి. దీంతో బస్సు అదుపుతప్పింది. డ్రైవర్ రవి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ అధికారులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ

ఓజిలి: మండలంలోని కార్చిమేడు, అత్తివరం, ఓజిలి, మానమాల, భట్లకనుపూరు, చిలమానుచేను గ్రామాల్లో శనివారం సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు, ఉప సర్పంచులు ఆధ్వర్యంలో సీసీరోడ్లను ఉపాధి హామీ నిధులతో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవీలత, ఉప సర్పంచ్ వినోద్‌నాయుడు, నాయకులు రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎల్లు గురుమూర్తి, మధుశేఖర్‌రాజు, పాడి వెంకటసుబ్బయ్య, ఏపీవో ఉషారాణి పాల్గొన్నారు.

కోటలో దంచికొట్టిన వర్షం

కోట: మండల కేంద్రమైన కోటతో పాటు పరిసర గ్రామాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 వరకు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలు పొంగి పొర్లాయి. విద్యానగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ, ప్రకాశంకాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది.


సైదాపురంలో..

సైదాపురం: మండలంలో శనివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం తుపాను ప్రభావంతో ఒక మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షానికి నిమ్మ, మామిడి పంటలకు ఊరట కలిగిందని రైతులు చెబుతున్నారు.

డక్కిలిలో..

డక్కిలి: మండలంలోని డక్కిలి, లింగసముద్రం, కమ్మవారిపల్లి, భీమవరం, కేబీపల్లి, దగ్గవోలు తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. వీధులు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ప్రవహించాయి. వెలుగొండ కొండల్లో కురిసిన వర్షాలతో కొన్ని చెరువులకు అరకొరగా నీరు చేరుతోంది. వర్షం ఇలాగే రెండు రోజులు కురిస్తే చెరువులు పూర్తిగా నిండి ఈ ఏడాది రబీ సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు వరి పంట సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి


పాపకన్ను రాజశేఖరరెడ్డి (ఫైల్)

రాపూరు : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి (81) శనివారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతున్నారు. ఆయన మునసబుగా, రాపూరు సమితి అధ్యక్షుడిగా, ఎంపీపీగా, ఏఎంసీ చైర్మన్‌గా, ఎల్‌ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి బావమరిది. ఆయన మృతదేహాన్ని ఆదివారం నెల్లూరుకు తీసుకువస్తారని, సోమవారం రాపూరు మండలం వేపినాపిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాపూరు మండల అధ్యక్షుడు పాపకన్ను దయాకర్‌రెడ్డి తెలిపారు.

భారీ వాహనాలతో స్తంభిస్తున్న ట్రాఫిక్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ట్రెజరీ ప్రధాన వీధిలో భారీ వాహనాలు ఇరుక్కుపోతుండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. మేనకూరు సెజ్ నుంచి భారీ మెషిన్‌తో వచ్చిన కంటైనర్ లారీ శనివారం రోడ్డులో కూరుకుపోయింది. దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. మేనకూరు సెజ్‌కు వెళ్లే వాహనాలు జాతీయ రహదారి మీదుగా కొత్తపల్లి గ్రామం మీదుగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణంలోని ఇందిరానగర్‌లో దంపతులపై దాడి చేసిన కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శనివారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇందిరానగర్‌కు చెందిన మారాసి చెంచుక్రిష్ణయ్య, అతని సొంత అల్లుడు సుబ్రమణ్యం కలిసి కందిపప్పు వ్యాపారం చేశారని తెలిపారు. ఆర్థిక లావాదేవీ విషయంలో సుబ్రమణ్యం కొంత మామకు కొంత నగదు బాకీ పడ్డాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొందన్నారు. మామను హతమారిస్తే ఇబ్బంది ఉండదని సుబ్రమణ్యం భావించాడని తెలిపారు. ఈ నెల 13వ తేదీ రాత్రి తన బంధువులైన గుత్తి విజయ్, గుత్తి భాస్కర్, గుత్తి సురేష్, రాజేష్, నలబాయి నరసింహులు, మనోహర్‌తో కలిసి ఇంటిలో నిద్రిస్తున్న మామ చెంచుక్రిష్ణయ్య, అత్త ధనమ్మపై కత్తితో దాడి చేశాడన్నారు. చెంచుక్రిష్ణయ్య ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఆరుగురిని అరెస్టు చేశామని వెల్లడించారు. మనోహర పరారీలో ఉన్నాడని, ఆరుగురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఎస్‌ఐలు గోపాల్, సుబ్రమణ్యం, రాజు, సిబ్బంది చిరంజీవి, సురేష్, నాగేంద్ర, సతీష్, మధు, క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకారం


విద్యార్థినికి చెక్కు ఇస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు : తీర ప్రాంత గ్రామాల్లోని పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం అందిస్తామని జిందాల్ పవర్ ప్రాజెక్టు (సింహపురి యూనిట్) సీహెచ్‌ఆర్‌వో ఆశీష్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం పేద విద్యార్థులకు చెక్కులు అందజేశారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇబ్బంది పడిన లింగవరం పంచాయతీ తీగపాళెం, గోనుగుంట, పల్లెవాని దిబ్బ గ్రామాల్లోని పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పరిశ్రమ ప్రతినిధులు శ్రీనివాసరావు, ఖలీద్, మ్యాథ్యూ, లీలా తదితరులు పాల్గొన్నారు.

పనుల అడ్డగింత


సంస్థ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

చిల్లకూరు : కోస్టల్ క్యారిడార్‌లో బాగంగా ఏపీఐఐసీ ద్వారా సేకరించిన భూములకు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు చేయాలని తీర ప్రాంత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. వారు శనివారం సంస్థ ప్రతినిధులను అడ్డుకున్నారు. తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో సుమారు 914 ఎకరాల భూమిని సేకరించారు. వీటిలో సాగులో ఉన్న వారికి పరిహారం ఇవ్వాలని అధికారులను కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ పలుమార్లు చర్చలు జరిపి పరిహారం అందించే విషయంపై ధరలు నిర్ణయించారు. ఆ ధరలు సాగుదారులు అంగీకరించలేదు. సంస్థ ప్రతినిధులు పనులు చేయకుండా పలుమార్లు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే సంస్థ ప్రతినిధులు శనివారం పనులు చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. తమ్మినపట్నం. గోనుగుంట, తీగపాళెం, పల్లెవానిదిబ్బ, తదితర గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి పైగా అక్కడకు చేరుకుని వారితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు వీఆర్వో బాలాజీతో కలిసి అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు.

మత్తుతో జీవితాలు చిత్తు



విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : మత్తు పదార్థాలను వినియోగిస్తే జీవితాలు నాశనం అవుతాయని తహసీల్దారు గీతావాణి తెలిపారు. పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉమామహేశ్వరి, చేయూత సంస్థ ప్రతినిధులతో కలిసి మాదకద్రవ్యాల వినియోగం, బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణాతో పాటు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను నివారించేందుకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల వద్ద నుంచి వాక్ ఫర్ ఫ్రీడమ్ పేరుతో ప్లకార్డులు పట్టుకుని పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. కళాశాల డైరెక్టర్ ఆకుతోట సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్ర, చేయూత సంస్థ వ్యవస్థాపకులు తొప్పని కృష్ణ, అధ్యాపకులు నాగరాజు, అశోక్, మస్తాన్, రమణయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.